క్లుప్తంగా

జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం

కొత్తకోట రూరల్: రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పట్టణ కేంద్రానికి చెందిన విశ్వనాథం వెంకటరమణను ఆదివారం పలువురు యజమానులు, వ్యాపారులు కలిసి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. రైస్ మిల్లుల యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రమణ, నర్సింహగౌడ్, రవితేజ, కవిందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అందుబాటులో జిలుగ విత్తనాలు

ఆత్మకూర్: పట్టణంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రంలో జిలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈఓ మహేశ్వరి తెలిపారు. 30 కేజీల జీలుగా విత్తనాల బస్తా రూ.1,116 సబ్సిడితో లభ్యమవుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ గురుకులాల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

గోపాల్‌పేట: ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ ఆరోగ్యం ప్రకటనలో తెలిపారు.

ఈ సంవత్సరం పదోతరగతి పాస్ అయిన వారు రూ.వంద చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం బుద్దారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోరారు. ఈనెల 31 వరకు అవకాశం ఉందని తెలిపారు. మహబూబ్‌నగర్ తూర్పు పరిధిలోని నాగర్‌కర్నూల్, వనపర్తి ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ, సీడీటీ వృత్తి విద్యా కోర్సుల్లో చేరేందుకు వారి ఉన్నతాధికారులు సూచించారని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మహబూబ్‌నగర్ రూరల్: మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక టీఎన్జీఓ భవనంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు బాల శ్రీనివాస్ పటేల్, ఉపాధ్యక్షుడు సమీర్‌కుమార్ పటేల్, గౌరవ అధ్యక్షుడు, టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగుల సత్యనారాయణ పటేల్, రాష్ట్ర బాధ్యులు ఏనుముల రాజు పటేల్, ఆకుల వెంకట్రావ్ పటేల్, శ్రీపతి బాపురావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా దుంకుడు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా బుక్క స్వామి, ప్రధాన కార్యదర్శిగా కోరమోని శ్రీనివాస్, కోశాధికారిగా కొత్తపల్లి సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా పాశం గోపాల్‌లు ఎన్నికయ్యారు.

శ్రీధర్‌రెడ్డి హత్యపై విచారణ చేపట్టాలి

కొల్లాపూర్: లక్ష్మీపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్యపై నిష్పక్షపాత విచారణ జరపాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డి హత్యపై సానుభూతి చూపకుండా ఆయన క్యారెక్టర్‌ను బదనాం చేసేలా మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు, కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఐదు నెలల కాలంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులపై ఇష్టానుసారంగా దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో జరుగుతున్న హత్యలు, దాడులపై ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరపాలన్నారు. సమావేశంలో రాంచందర్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లిపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

పెద్దకొత్తపల్లి: లక్ష్మీపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్యలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హస్తం ఉందని కేటీఆర్, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లు ఆరోపించడం సమంజసం కాదని పెద్దకొత్తపల్లి మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు విష్ణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు అనవసరంగా జూపల్లిపై బురదజల్లే ఆరోపణలు మానుకోవాలన్నారు. గంట్రావుపల్లిలో ఆర్మీ జవాన్ మల్లేష్ హత్య భూతగాదాలతో జరిగితే దాన్ని మంత్రికి అంటగట్టే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరాధార ఆరోపణలు మానుకోవాలన్నారు.

పోస్టర్ విడుదల

గట్టు: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం నాయకులు విడుదల చేశారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 30న ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

గతుకుల రోడ్లే దిక్కు

- పూర్తిగా ధ్వంసమైన మూలమళ్ల రహదారి
- నిత్యం ప్రయాణికుల పాట్లు
- నిధులు మంజూరైనా సాగని పనులు



ఆత్మకూర్ శివారులో గుంతలమయంగా మారిన మూలమళ్ల రహదారి

ఆత్మకూర్: ఏళ్లు గడుస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరక యాతన అనుభవిస్తున్నారు. మండలంలోని మూలమళ్ల, నందిమళ్ల గ్రామాలకు, జూరాల ప్రాజెక్టుకు వెళ్లేందుకు పట్టణంలోని పెట్రోల్‌బంకు మలుపు నుంచి మొదలుకుని 7కి.మీ. బీటీరోడ్డను ఏర్పాటు చేశారు. చిన్నపాటి వర్షం వచ్చిన రోడ్లు గుంతమయంగా మారుతున్నాయి. నీరు రోడ్డుపైనున్న గుంతల్లో చేరి ఇబ్బందికరంగా మారుతుంది. 2004లో వేసిన రోడ్డు ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. పదేళ్లుగా కొత్త బీటీరోడ్డు వేయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పటికైన స్పందించి చర్యలు తీసుకోవాలని మూలమళ్ల, నందిమళ్ల గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.8.50 కోట్లతో రోడ్డు

మూలమల్ల మలుపు నుంచి నందిమళ్ల, జూరాల ప్రాజెక్టు వరకు రూ.8.50 కోట్ల నిధులతో 2016లో రోడ్డు పనులు ప్రారంభించారు. మొదటి దఫా నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులను మధ్యలోనే వదిలేశాడు. ఈ విషయమై గ్రామస్తులు పలుమార్లు పీజేపీ కార్యాలయం వద్ద ధర్నా చేసిన నిధులలేమితో పనులు ముందుకెళ్లలేదు. పంచాయతీరాజ్ నిధుల నుంచి రోడ్డు వేయాలని కోరుతున్నారు.



జూరాలకాల్వ సమీపంలో ధ్వంసమైన రోడ్డు



నందిమల్ల శివారులో వర్షాకాలంలో రోడ్డు దుస్థితి

నిత్యం ప్రమాదాలు

నందిమల్ల నుంచి మూలమల్ల మీదుగా ఆత్మకూర్‌కు వెళ్లాలంటే భయమేస్తుంది. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది వరకే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు కావడం లేదు. విషయాన్ని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లాం.

– అరవింద్‌రెడ్డి, నందిమళ్ల

అధికారుల అసమర్థత

2016లో పుష్కరాలప్పుడు మంజూరైన రోడ్డు పనులు నేటికి కాకపోవడంతో పాలకులు, అధికారుల అసమర్థతే. నిత్యం ప్రమాదాలు అవుతున్నా, ప్రయాణికులు చనిపోతున్నా స్పందించకపోవడం పాలకుల పనితీరుకు నిదర్శనం. వెంటనే పనులను ప్రారంభించకపోతే ఉద్యమిస్తాం.

–భీమన్న, మూలమళ్ల

ఉత్సాహంగా కిడ్స్ ఫెస్టివల్



సూపర్ కిడ్ విజేత యేబేలును సన్మానిస్తున్న పాస్టర్ పరంజ్యోతి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రెమా చర్చ్‌లో పాస్టర్ బీఎస్.పరంజ్యోతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కిడ్స్ ఫెస్టివల్ ఉత్సాహంగా జరిగింది. ఈ ఏడాదికిను సూపర్ కిడ్‌గా నిలిచిన యేబేలును పరంజ్యోతిని ఘనంగా సత్కరించి కిరిటాన్ని బహుకరించారు. పాస్టర్ పరంజ్యోతి మాట్లాడుతూ చిన్నారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది వేసవిలో కిడ్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన కిడ్స్ ఫెస్టివల్‌లో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 200 మంది చిన్నారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రసన్నకుమార్, గోదావరి ఖనికి చెందిన సిస్టర్ యూనిస్ బైబిల్‌పై ఆటలు, స్కిట్స్, క్రాఫ్ వర్క్స్, కొరియోగ్రఫీ, సంగీతం లాంటి అంశాలు నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారిని ఈ ఏడాదికి కిడ్స్ విజేతగా ఎంపిక చేస్తామని, అందులో భాగంగా యేబేలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్న ప్రతి చిన్నారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కిడ్స్ ఫెస్టివల్ ముగింపు సందర్భంగా చిన్నారులంతా ఆట, పాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్యామ్ కమలాకర్, స్పర్జన్‌రాజు, ఎస్తేరు, మణెమ్మ, బ్లాండీనా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం



దుప్పల్లిలో ఒరిగిన చెట్టు

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా వచ్చిన ఈదురు గాలులకు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్న చెట్టు ఒరిగింది. పక్కనే విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు రెండు గంటలపాటు గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. జేసీబీసాయంతో చెట్టు తొలగించి వైర్లను పునరుద్ధరించారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



కొల్లాపూర్: మండలంలోని నాగినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మైసమ్మ దేవతను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు 9 వేల మంది భక్తులు హాజరైనట్లు దేవాదాయ శాఖ అధికారి రంగారావు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేటు వాహనాల్లో తరలివచ్చారు. వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు.

గాలివాన బీభత్సం



ఇప్పటూర్‌లో రోడ్డుపై విరిగిపడ్డ స్తంభం



చౌటపల్లి గ్రామంలో దెబ్బతిన్న రేకుల ఇల్లు

- నేలకూలిన స్తంభాలు, చెట్లు దెబ్బతిన ఇళ్లు

నవాబుపేట: మండలపరిధిలో ఆదివారం గాలీవాన బీభత్సం సృష్టించింది. దీంతో ఇప్పటూర్, చౌటపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పాటు గాలికి రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి. రెండు గ్రామాల్లో దాదాపు 8 మంది ఇళ్లు దెబ్బతినడం గమనార్హం. ఇప్పటూర్‌లో ఎక్కడ చూసినా రోడ్లపై విరిగిపడిన చెట్లు, విద్యుత్‌స్తంభాలే కనిపించాయి. కాగా ఒక ట్రాక్టర్‌తో పాటు రెండు ద్విచక్ర వాహనాలు చెట్లు పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. కాగా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని విద్యుత్ పునరుద్ధరించాలని ఎంపీటీసీ తులసీబాయి, మాజీ సర్పంచ్ అబ్దుల్లాలు సంబంధిత అధికారులను కోరారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు అందరూ కలిసి ఇళ్లు, రోడ్లపై పడ్డ చెట్ల తొలగింపు చేపట్టినట్లు వివరించారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద ఎత్తున గాలి వీస్తూ వర్షం కురిసింది. మూసాపేట మండలం సంకలమద్దిలో డీలర్ వాసుదేవమ్మకు చెందిన ఇంటిపై రేకులు ఎగిరి పోయాయి. ఇతర గ్రామాల్లో పెద్ద, పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. పంట పొలాల్లో వర్షంతో నీళ్లు నిలిచాయి. గత రెండు, మూడు రోజులుగా సాయంత్రం వేళ వర్షం కురవడంతో పాటు ఈదురు గాలులతో నష్టం వాటిల్లుతోంది.



తిరుమలగిరిలో..

భూత్పూర్: మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాలల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. పట్టణంలో శ్రీమునిరంగస్వామి దేవాలయం ఎదుట ఉన్న ధ్వజస్తంభం ఈదురు గాలులకు నేలకొరిగింది. కొన్ని చోట్లు విద్యుత్తు స్తంభాలు, చెట్లు పడిపోగా మూడు గంటల పాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది.

బాలానగర్ పరిధిలో..

బాలానగర్: మండల కేంద్రంతోపాటు, తిరుమలగిరి గ్రామం, కేశ్యనాయక్ తండాలో ఈదురుగాలులతో కూడిన గాలివానలతో ముగ్గురు ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. దీంతో కుమార్, తౌర్యనాయక్, బుగ్యనాయక్ కుటుంబాలకు ఆశ్రయం లేకుండా పోయింది. కాగా ప్రభుత్వం సాయం అందించాలని కోరారు.

కలెక్టర్ బంగ్లా చౌరస్తాలో..



కలెక్టర్ బంగ్లా చౌరస్తాలో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలో ఆదివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వర్ష బీభత్సంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. జిల్లాలోని అడ్డాకుల, మూసాపేట, గండీడ్, నవాబుపేట, మహమూబ్‌నగర్ అర్బన్ పరిధిలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. సుమారు 45 నిమిషాల పాటు కురిసిన వర్షానికి పలు రోడ్లు జలమయమయ్యాయి. గాలి దుమారంతో కూడిన వర్షం కురవడంతో కలెక్టర్ బంగ్లా చౌరస్తా, బోయపల్లి గేటు ప్రాంతాల్లో చెట్లు విరిగి రోడ్లపై అడ్డం పడగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

హన్వాడ పరిధిలో..

హన్వాడ: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షానికి పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. వేపూర్ వైపు వెళ్లే రహదారికి అడ్డంగా ఓ వృక్షం కొమ్మ విరిగిపడడంతో అటువైపు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా గొండ్యాల్‌లోని మాదిగి చెన్నప్ప ఇంటిపై సమీపంలోని పోచమ్మ ఆలయం వద్ద ఉన్న ఓ భారీ వృక్షం కూలింది. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొత్తపేటలో నాగయ్య అనే వ్యక్తి కిరాణా డబ్బా లేచిపోయి వంద మీటర్ల దూరంలో పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



హన్వాడ నుంచి వేపూర్ వెళ్లే దారిలో అడ్డంగా పడిన చెట్టు

బీఆర్‌ఎస్ బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని ఈదులబావితండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త శంకర్‌నాయక్(40) ఇటీవల మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కు వచ్చింది. మృతుడి భార్య పేరుపై వచ్చిన చెక్కును ఆదివారం తండాకు చేరుకుని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. పార్టీకి పనిచేసే వారికి ఎప్పుడు పార్టీ అండగా ఉంటుందని, ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, మల్లేష్, విశ్వేశ్వర్, గాడీల ప్రశాంత్, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, గాదం పరమేష్, కౌన్సిలర్ తిరుపతయ్య ఉన్నారు.

మున్సిపల్ కార్మికులతో కాలనీవాసుల వాగ్వాదం



పనులను అడ్డుకుంటున్న కాలనీవాసులు

అమరచింత: పట్టణంలోని మూడో వార్డులో గల కాశీకామాత ఆలయ ఆవరణలో నాలుగు రోజులుగా నిలిచిన వర్షపు నీటిని మళ్లించడానికి వచ్చిన మున్సిపల్ కార్మికులతో కాలనీ వాసులు వాగ్వాదానికి దిగారు. దేవాలయం పక్కనే ఉన్న మురుగు పరిస్థితితో పాటు వర్షపు నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కరం చూపాలని తాత్కాలికంగా పనులు చేసి వెళ్లిపోతే ఎలా అని కార్మికులు చేస్తున్న పనులను అడ్డుకున్నారు. నాలుగు రోజులుగా సమస్యపై పత్రికల్లో వస్తున్న వార్తలపై మున్సిపల్ అధికారులు ఆదివారం తమ పారిశుద్ధ్య కార్మికులతో వాటిని పూర్తి చేయడానికి వచ్చారు.

శాశ్వత పరిష్కారం కావాలి..

తమ వార్డులోని మురుగు ముందుకు వెళ్లలేక కుంటను తలపిస్తుందని శాశ్వతంగా పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ విజయరాములు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఇప్పటి వరకు పట్టణంలోని వార్డులలో ఎలాంటి సమస్యలు ఉన్నాయే అన్న విషయాలను సైతం గుర్తించలేదని వాపోయారు. తమ వార్డు ప్రజల కోరిక మేరకు శాశ్వత పరిష్కార పనులు చేపట్టాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేస్తామన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



అప్పారెడ్డిపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లిలో ఆదివారం బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కుర్వ గొల్లలు ఉదయం నుంచి బీరప్ప దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కుంకుమ, పసుపు, పూలు, గంధంతో అందంగా అలంకరించిన బోనాలలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని ఊరేగింపుగా వెళ్లారు. గ్రామంలోని దేవాలయం నుంచి స్వామి వారిని స్మరిస్తు ఖిల్లాఘనపురం వెళ్లే రోడ్డు వైపున ఉన్న దేవాలయం వద్దకు చేరుకున్నారు. బోనాల ఎదుట డోళ్ల చప్పుళ్లకు పూనకాలతో ఊగిపోయారు. నైవేద్యాన్ని స్వామి వారికి అర్పించి మొక్కులు తీర్చుకుని తిరిగి గ్రామానికి వచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మదనాపురం మండలం దుప్పల్లిలో..



శ్రీరంగాపురం మండల కేంద్రంలో..

మదనాపురం: ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు అవ్వాలని పూర్వ ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి అన్నారు. మండలంలోని దుప్పల్లిలో ఆదివారం 2003–04 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాడు పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వృత్తిలో స్థిరపడ్డ అంశాలపై వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆదర్శంగా నిలవాలన్నారు. ఎవరూ అధైర్య పడకుండా చేస్తున్న పనిని నమ్మకంగా కొనసాగిస్తూ మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. నాడు పాఠశాలలో చదువకుని కలిసి ఉన్నట్టుగానే ఎప్పటికీ అలాగే ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరుణాకర్, హుస్సేన్‌రెడ్డి, ఖాజన్‌గౌడ్, నిస్సార్, నిర్మల, సరిత, రాధిక పాల్గొన్నారు.

డిగ్రీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెబ్బేరు రూరల్: వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలో 1990–93 విద్యా సంవత్సరంలో డిగ్రీ చదువుకున్న విద్యార్థులు ఆదివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగానాయక స్వామి ఆలయం వద్ద ఒకే వేదికపై కలుసుకున్నారు.

ప్రమాదకర మలుపులు



షాపురం శివారులో ప్రమాదకరంగా ఉన్న మలుపు



మహ్మద్‌హుస్సేన్‌పల్లి వెళ్లే దారిలో..

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే దారులకు ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మలుపుల దగ్గర విపరీతంగా ముళ్లకంచె చెట్లు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. మలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రం నుంచి వెంకటాంపల్లికి వెళ్లే రోడ్డుకు కస్తూర్బా గాంధీ పాఠశాల వద్ద, పర్వతాపురం, మామిడిమాడ వెళ్లే రోడ్డుకు పెద్దబాయి సమీపంలో, వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డుకు షాపురం స్టేజి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద, షాపురం తండాలకు వెళ్లే దారిలో గ్రామ శివారులో ఆగారం రోడ్డుకు మహ్మద్‌హుస్సేన్‌పల్లి రోడ్డు మలుపుల వద్ద తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఆయా మలుపుల వద్ద బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాన్‌గల్‌లో తీవ్రమైన కోతుల బెడద



పాన్‌గల్‌లోని పెట్రోల్ బంక్ వద్ద కోతుల గుంపు

పాన్‌గల్: మండల కేంద్రంలో రోజు, రోజుకు కోతుల బెడద తీవ్రమైంది. గ్రామంలో తలుపులు తెరచి ఉంటే వారి ఇల్లు గుల్ల అయినట్లే. ఆహార పదార్థాలు, కూరగాయాలు, వంట సామాగ్రిని ఎత్తుకెళ్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికి గ్రామంలో కోతుల దాడిలో ఎంతో మంది గాయపడ్డారు. వాటి బాధను భరించలేక ఇంట్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దీంతో పాటు రైతుల పొలాల్లోకి గుంపులు, గుంపులుగా చేరి పంటలను కూడా నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో గ్రామంలోని కోతుల బెడదను నివారిస్తామని చెప్పి ఓట్లు దండుకున్న తర్వాత ఆ సమస్యపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామంలో కోతుల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.